

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

పైసలిస్తేనే పని...

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి రాజ్యం - ప్రతి పనికీ డబ్బులు వసూలు

- ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ - దృష్టి సారించని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. పలు చోట్ల ఎసిబి అధికారులు అవినీతి అధికారులను పట్టుకుని కటకటాల్లోకి పంపినా అధికారుల తీరులో మార్పు రావడంలేదు. పైసలిస్తేనే పని అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ప్రతి పనికీ డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. లే అవుట్లు, ల్యాండ్ కన్వర్షన్, మున్సిపల్ అప్రూవల్ లేకపోయినా ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్ చేస్తూ అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇలాంటి వారిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 921 రెవెన్యూ గ్రామాలు, 993 పంచాయతీలున్నాయి. 40.52 లక్షల జనాభా ఉన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రాలతో పాటు ప్రతి నియోజకవర్గ కేంద్రంతో పాటు కొన్ని మండల కేంద్రాల్లో ప్రజలు, రైతులు, వివిధ రంగాలకు చెందిన వారికి సేవలందించేందుకు సబ్ రిజిస్ట్రార్, ఉప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్యాలయాల్లో భూములు, ఇళ్లు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయడం, పెళ్లిళ్లు, సొసైటీలు, ఆలయ కమిటీలు వంటి సేవలు అందిస్తున్నారు. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతీ పనికి డబ్బులు గుంజడం సిబ్బందికి అలవాటుగా మారింది. పైసలియ్యకపోతే గంటలో కావాల్సిన పనికి రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ దురుసుగా సమాధానం ఇవ్వడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపేందుకు, భూముల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆన్‌లైన్ విధానంతో పాటు 2.0ను ప్రవేశపెట్టింది. అయినా అవినీతి అక్రమాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన లే అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్) సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బందికి కాసులు కురిపిస్తోంది. భూములను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్ఆర్ఎస్ గడువు అక్టోబర్ 15గా ప్రభుత్వం ప్రకటించింది. చాలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వేలల్లో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఇందుకు సబ్ రిజిస్ట్రార్లు జారీ చేసే స్థిరాస్థి విలువ నిర్ధారణ పత్రం తప్పనిసరి. గడువు దగ్గర పడుతున్నందున సహజంగానే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రజల తాకిడి పెరిగింది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొందరు కార్యాలయ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. కేవలం ఒక గంట వ్యవధిలో జారీ చేయాల్సిన మార్కెట్ వాల్యూ సర్టిఫికేట్‌ను డబ్బులివ్వడం లేదనే నెపంతో రోజుల తరబడి తిప్పుకుంటున్నారు. దీంతో చేసేదేమీ లేక సిబ్బంది అడిగినంత చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్తున్నట్లు సమాచారం.

ప్రతి పనికీ ఓ రేటు..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి పనికీ ఓ రేటును ఫిక్స్ చేసుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. భూములు, ఇతర ఆస్తులకు సంబంధించిన దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు మార్కెట్ విలువపైన సేల్ డీడ్ అయితే స్టాంపు డ్యూటీ 4 శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ సుంకం 1.5 శాతం, రిజిస్ట్రేషన్ చార్జీలు 0.5 చొప్పున మొత్తం 6 శాతం చార్జీలు చెల్లించాలి. అదే గిఫ్ట్ డీడ్ అయితే స్టాంపు డ్యూటీ ఒక శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 0.5 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 0.5 శాతం



చొప్పున కనీసం రూ.1000లు, గరిష్టంగా రూ. 10 వేలు చెల్లించాలి. పై చార్జీలు ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉండగా ఒక్కో డాక్యుమెంట్‌పై రూ.1000ల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అలా కాకుండా లొసుగులుంటే కనీసం రూ.3 వేల నుంచి గరిష్టంగా రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే ఈసీ జారీ చేసేందుకు 1983 నుంచి ఇప్పటి వరకు చార్జీలు రూ.220లు, అంతకు ముందు సంవత్సరాలకు సంబంధించి ఈసీ జారీ చేసేందుకు రూ.520లు చార్జీలు చెల్లించాలి. కానీ అదనంగా మరో రూ.200లు అక్రమంగా వసూలు చేస్తున్నారు. ధ్రువీకరించిన నకలు కాపీలు జారీ చేసేందుకు ప్రభుత్వ పరంగా చార్జీలు 1983 నుంచి ఇప్పటి వరకు రూ.220 ఉంటే, అంతకు ముందు నకలు కావాలంటే రూ. 520 చెల్లించాలి. అయితే ఇక్కడ అదనంగా రూ.300 వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థిరాస్తి విలువ నిర్ధారణ పత్రం (మార్కెట్ వాల్యూ సర్టిఫికేట్) జారీకి అధికారికంగా రూ.10లు చెల్లించాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం రూ. 200 వసూలు చేస్తున్నారు. పెళ్లి రిజిస్ట్రేషన్లకు రూ.250ల చార్జీలు ఉండగా, రూ.500 వసూలు చేస్తున్నారు. అందులో లొసుగులుంటే రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గోడలపై అతికించిన సిటిజన్ చార్టు బోర్డులు అలంకార ప్రాయంగా మారాయి. భూముల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు చేసేందుకు గరిష్టంగా 24 గంటల సమయం పడుతుండగా, కంప్యూటరైజ్డ్ ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) జారీకి గంట, అలాగే ఈసీ నకలు మ్యానువల్ ఇచ్చేందుకు 24 గంటలు, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్లకు గంట, పెండింగ్ డాక్యుమెంట్లు ఇచ్చేందుకు ఒక రోజు, పెండింగ్ డాక్యుమెంట్లు సెక్షన్ 47-ఏ కింద జారీ చేసేందుకు 7 రోజులు, భూముల మార్కెట్ వాల్యువేషన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు గంట సమయం కేటాయిస్తూ సిటిజన్ చార్టులో పేర్కొన్నారు. కానీ అదనంగా ముడుపులు చెల్లిస్తేనే పనులు చేస్తారు. లేకుంటే రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటారు. అందువల్ల జిల్లా ఉన్నతాధికారులు ఇలాంటి పరిస్థితులున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై దృష్టి కేంద్రీకరించి అవినీతి అక్రమాలపై ఉక్కుపాదం మోపి ప్రజలు, రైతులు, వివిధ రంగాలకు మెరుగైన సేవలందించేలా చూడాలని జిల్లా ప్రజలు, రైతులు కోరుతున్నారు.

వివక్షత నిర్మూలనకు
చర్యలు తీసుకోవాలి

- దళిత మహిళను కట్టేసి కొట్టిన వారి అరెస్టు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రేమ వివాహం చేసుకున్నాడని నెపంతో తల్లిని విద్యుత్ స్తంభానికి కట్టి వేసిన ఆధిపత్య వర్గాలను వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దళిత మహిళను కొట్టి విద్యుత్ స్తంభానికి కట్టేసి మానసిక అంగవైకల్యం కలిగిన వ్యక్తితో పెళ్లి చేయాలని చూసిన అధిపత్య వర్గాలను అరెస్టు చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు కెవిపిఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. న్యూ సిటీ కార్యదర్శి ఎం భాస్కర్ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నగేష్, రజక వత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి గురు శేఖర్, కెవిపిఎస్ మహిళా నాయకులు డి విజయమ్మ మాట్లాడారు. పెద్దకడబూరు మండలం, కల్లకుంట గ్రామంలో గత ఆరు నెలల క్రితం ఎస్సీ దళిత యువకుడు బీసీ అమ్మాయి ప్రేమ వివాహం చేసుకుంటే గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ చేసి వారిని గ్రామ బహిష్కరణ చేశారన్నారు. ఆధిపత్య వర్గాలకు భయపడిన యువకుడు తల్లి తల్లి వారితో పాటే గ్రామం వదిలి వేరే చోట బంధువుల ఇంట్లో తలదాచుకున్నారన్నారు. ఆరు నెలల తర్వాత గ్రామంలో ఉన్న తన పంట భూమిని వేసుకుందామని వచ్చిన తల్లిని చూసిన ఆధిపత్య వర్గాలు దాడికి పూనుకున్నారన్నారు., అమ్మాయి తల్లిదండ్రులను రెచ్చగొట్టడంతోపాటు, ఆమెపై దాడి చేయకపోతే మిమ్మల్ని గ్రామ బహిష్కరణ చేస్తామని చెప్పడంతో ఆధిపత్య వర్గాలతో కలిసి అమ్మాయి బంధువులు, అబ్బాయి తల్లిని కొట్టి, విద్యుత్ స్తంభానికి కట్టేసి, మతిస్థిమితం లేని వికలాంగుడితో వివాహం చేయాలనే ప్రయత్నం చేశారన్నారు. పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే ఆమెను రక్షించారన్నారు .ఘటనకు కారణమైన ఆధిపత్య వర్గాలందరిపైనా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ, కలెక్టర్లు సందర్శించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. జిల్లాలో నెలకొన్న అంటరానితనం రూపుమాపేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు రోషన్న, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, కర్నూల్ న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్ భాష, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ కెవిపిఎస్ ఓల్డ్ సిటీ నాయకులు ప్రదీప్, జయమ్మ, న్యూ సిటీ నాయకులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో స్పందించాలి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

వరద ముంపుకు గురై నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో స్పందించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు కూడా తమ వంతు సహాయ సహకారాలను వరద బాధితులకు అందించాలని. ప్రతి ఒక్కరూ స్పందించి విరాళాలను అందజేయాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి విభాగం జిల్లా అధ్యక్షులు మద్దిలేటి ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షులు పి రాజమనమ్మ , మాజీ అధ్యక్షులు బి సి నాగరాజు, ఆదోని జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

వందరోజుల లక్ష్యాల పురోగతిపై దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

- కలెక్టర్ రంజిత్ బాష

- సెరికల్చర్ శాఖ డిడిపై ఆగ్రహం

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

వంద రోజుల లక్ష్యాల పురోగతిపై మండలాల వారీగా దృష్టి పెట్టి సాధించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం వంద రోజుల లక్ష్యాల సాధనపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో వంద రోజుల లక్ష్యాలను ఎంతవరకు సాధించారో పూర్తి స్థాయిలో సమీక్షించారు. సెరికల్చర్ శాఖ ఇప్పటి వరకు లక్ష్యాలను నిర్దేశించుకో లేదా అని శాఖ డిప్యూటీ డైరెక్టర్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణకు వీలుగా జీవనో పాధుల కల్పనపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. జీవనోపా ధులను కల్పించగలమని గ్రామాల వారీగా ఒక కార్యాచరణ ప్రణాళికతో రావాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ ఆర్డీఓలు ఈ కమిటీకి ఛైర్మన్లుగా ఉండి, ఆయా డివిజన్లలో అమలు చేసే విధంగా రెండు మూడు నెలల్లోపు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాల ని ఆదేశించారు.. కర్నూలు జగన్నాథ గట్టు, ఆదోని, ఎమ్మిగనూరులలో టిడ్కో ఇళ్ల వద్ద ఖాళీగా ఉన్న స్థలాల్లో నగర వాటికలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ గురుకులాల ఏర్పాటుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ టీవీలు, పోలీస్ పికెటింగ్, ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జెసి బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఇంఛార్జి డిఆర్ఓ చిరంజీవి,, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

20న కర్నూలులో జాబ్ మేళా

ఈనెల 20న కర్నూల్ నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌లు ఆవిష్కరించారు. జాబ్‌మేళా నిరుద్యోగులకు సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాగప్ప 8688030375, సాయి తేజ 8309283980 కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల : అభిలాష్ 9059524482, కర్ణ 7780478910) నంబర్లకు సంప్రదించగలరని తెలిపారు.

గణష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్‌పి

-1,689 మంది పోలీసులతో భారీ బందోబస్తు

-15 తేదిన గణేష్ నిమజ్జనం- నగరంలో ట్రాఫిక్ మళ్ళింపు

-సంప్రదాయరీతిలో ఉండాలి- కట్టుదిట్టమైన భద్రత



ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

కర్నూలులో ఈనెల 15న గణేష్ నిమజ్జనం జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భారీ బందోబస్తు చర్యలు చేపట్టిందని, ప్రశాంత వాతవరణంలో శాంతియుతంగా నిర్వహించు కునేందుకు అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బందోబస్తు వివరాలను వెల్లడించారు. అడిషనల్ ఎస్‌పి ఒకరు, 11 మంది డిఎస్‌పిలు , 58 మంది సిఐలు, ఆర్ ఐలు, 133 మంది ఎస్ఐలు, ఆర్ ఎస్ఐలు, 346 మంది ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 642 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 34 మంది మహిళా పోలీసులు, 464 మంది హోంగార్డులు, 6 సెక్షన్ల ఎర్ సిబ్బంది , 15 స్పెషల్ పార్టీ బృందాలు , కర్నూలు జిల్లాతో పాటు అన్నమయ్య, కడప, నంద్యాల జిల్లాల నుండి మొత్తం 1,689 మంది పోలీసులను భారీ సంఖ్యలో మొహరింపజేస్తామని తెలిపారు. నిబంధనలకు ఎవరు విరుద్ధంగా ప్రవర్తించినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు. బాంబు డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తత తనిఖీలు, నిమజ్జనం కార్యక్రమం అంతా డ్రోన్, సిసికెమెరాలు, వీడియో కెమెరాలతో చిత్రికీరిస్తామని, అసాంఘిక శక్తులు, అల్లరి మూకల పై గట్టి నిఘా ఉంచుతామని అన్నారు. విగ్రహాలు బయలు దేరేటప్పుడు కరెంటు తీగల వద్ద గణేష్ నిర్వహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. విగ్రహాలను తరలించడానికి ముందురోజే వాహనాలను క్రేన్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చిన్న పిల్లలు నిమజ్జన ఊరేగింపు వాహనాలకు దూరంగా ఉండాలని సూచించారు. నిమజ్జన ఘాట్ల దగ్గర కు నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చే మహిళలు, వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

నగరంలో ట్రాఫిక్ మళ్ళింపుస

గణేష్ నిమజ్జనం సంధర్భంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి గణేష్ నిమజ్జనం పూర్తయ్యే వరకు నగరంలో ట్రాఫిక్ ను మళ్లించినట్లు జిల్లా ఎస్‌పి తెలిపారు. అత్యవసర (108, ఫైర్ , అంబులెన్సులు, పోలీసు వాహనాలు) సేవల కోసం పోలీసు వారితో అనుమతి పొందిన వాహనాలు మాత్రమే నిమజ్జన మార్గంలో అనుమతిస్తారు. కర్నూలు ఆర్టీసి బస్టాండ్ నుండి రాజ్ విహార్ సెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్, వినాయక్ ఘాట్, గాయత్రి ఎస్టేట్ వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి ఉండదు. వాహనాల రాక, పోకల నిషేధం ఉంటుంది. కర్నూలు ఆర్టీసి బస్టాండ్ నుండి ఆర్టీసి బస్సులు, ఇతర వాహనాలను బళ్ళారి చౌరస్తా మీదుగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంక్ , బిర్లా జంక్షన్ , మద్దూర్ నగర్ సర్కిల్ , సి. క్యాంపు మీదుగా నంద్యాల చెక్ పోస్టు వైపు వాహనాల రాక, పోకలు ఉంటాయని పేర్కొన్నారు. ఆత్మకూరు, నంద్యాల, నందికోట్కూరు, నంద్యాల చెక్ పోస్టు వైపు నుండి నగరంలోనికి వచ్చే వాహనాలు సి. క్యాంపు, బిర్లాగేట్ , గుత్తి పెట్రోల్ బంక్ నుండి కల్లూరు చెన్నమ్మ సర్కిల్ , బళ్ళారి చౌరస్తా మీదుగా కర్నూలు , బస్టాండ్ కు చేరుకుంటాయి.హైదరాబాద్, గద్వాల, అలంపూర్ నుండి వచ్చే వాహనాలు తుంగభద్ర బ్రిడ్జి , సంతోష్ నగర్, బళ్ళారి చౌరస్తా మీదుగా కర్నూలు బస్టాండుకు చేరుకుంటా యయన్నారు. అనంతపురం, డోన్ నుండి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంకు మీదుగా కర్నూలు బస్టాండ్ చేరుకుంటా యయనితెలిపారు. నిమజ్జనం పూర్తయిన తర్వాత నిమజ్జన వాహనాలు దేవనగర్ మీదుగా కృష్ణనగర్,కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళతాయన్నారు.

కార్మికుల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి

పలుచోట్ల సీతారాం ఏచూరి సంతాప సభలు

పజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కార్మిక కర్షకుల ఆశాజ్యోతి సీతారాం ఏచూరికి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో లారీ హమాలి యూనియన్ ,కోత అంగడి గుమస్తాల హమాలి యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ యూనియన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సంతాప సభకు సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు, సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు లు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందన్నారు. సీతారాం ఏచూరి మరణం కార్మిక వర్గానికి, రైతాంగానికి, దేశ ప్రజలకు, వామపక్ష ప్రజాతంత్ర శక్తులకు తీరని లోటని అన్నారు. విద్యార్థి దశ నుండి అంచలంచెలుగా ఎదిగి మూడుసార్లు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై రాజ్యాంగాన్ని రక్షించేందుకు మత రాజకీయాలను వ్యతిరేకిస్తూ లౌకికవాద స్ఫూర్తిని కొనసాగిస్తూ దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. హమాలీ యూనియన్ల నాయకులు బీసన్న, నాగరాజు, వెంకటస్వామి, రామకృష్ణ, మనోహర్, కేశవులు, కృష్ణ, త్యాగరాజు, వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు హమాలి కార్మికులు పాల్గొన్నారు.

కర్నూలుకార్పొరేషన్: ఎపి రజక వృత్తిదారుల సంఘం కర్నూలు సిటీ కమిటీల ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ కార్యాలయంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముందుగా నాయకులు ఊచూరి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కర్నూల్ న్యూ సిటీ కార్యదర్శి సి .శేషాద్రి అధ్యక్షతన సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సి .గురుశేఖర్, ఓల్డ్. సిటీ కార్యదర్శి సిహెచ్. శ్రీనివాసులు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో మరో శిఖరం నేలకొరిగిందన్నారు. ఆయన చేసిన సేలను కొనియాడారు.



కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో సంతాప సభలో గౌస్‌దేశాయి, అంజిబాబు, రాముడు

ఎపి వేర్‌హౌజ్ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో

కర్నూలు నగరంలోని ఎపి వేర్ హౌస్ హమాలీ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో వేర్ హౌస్‌లో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు ఎన్.విష్ణుమూర్తి అధ్యక్షత వహించారు. జోహార్ సీతారాం ఏచూరి, రెడ్ సెల్యూట్ ఏచూరి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆయన చిత్రపటానికి పూలు పూలుచల్లి నివాళుఅర్పించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి అంజిబాబు, నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా మాట్లాడారు. సీతారాం సేవలను కొనియాడారు. వేర్ హౌస్ హమాలి యూనియన్ కార్యదర్శి ఎం.మల్లికార్జున, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, జాయింట్ సెక్రెటరీ పురుషోత్తం, మధు, గోవిందు రంగన్న, ఇసాక్, ఇ.విజయుడు, జయన్న, మద్దిలేటి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

జిల్లామోటార్ వర్కర్స్ యూనియన్ సంతాపం

భారత రాజకీయ ల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించిన ఏచూరి లేని లోటు పూడ్చలేనిది అని కర్నూలు జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ అన్నారు. చిన్ననాటి నుండే అభ్యుదయ భావాలను అలవరచుకొని చదువులో మొదటి స్థానంలో నిలుస్తూ ఉద్యమాల్లో పాల్గొంటూ అందరి దృష్టిని ఆకర్షించిన ఏచూరి ఢిల్లీ జెఎన్‌యులో విద్యార్థుల సమస్యలతోపాటు యూనివర్సిటీ అభివృద్ధి కోసం యూనియన్ నాయకులు, ఎస్.కె.రియాజ్, బి.గంగాధర్, వలి, సిపిఎం సీనియర్ నాయకులు సర్వేశ్వర్ రెడ్డి,యూనియన్ కమిటీ సభ్యులు ప్రసాద్ రెడ్డి,నాగిరెడ్డి,మాబాష డ్రైవర్లు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం బాధాకరం ఆయన లేని లోటు దేశంలో కమ్యూనిస్టులకు తీరనిదని సిపిఎం మండల కార్యదర్శి గఫూర్మియా అన్నారు. రాలిపోయినా అరుణతార ఊచూరికి కోడుమూరు సిపిఎం కార్యాలయంలో సంతాపం తెలిపారు. మండల కమిటీ సభ్యులు టి.వీరన్న, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మన్న, సిఐటియు మండల కార్యదర్శి జిపి వీరన్న .డివైఎఫ్ఐ నాయకులు మధుబాబు, బి.రాజు, చేనేత నాయకులు మునుస్వామి, నాగరాజు, వెంకటేష్, రాముడు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : సీతారాం ఏచూరి మృతి పట్ల ఓర్వకల్లు మండలంలోని ఓర్వకల్లు, నన్నూరు సిపిఎం శాఖల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి బి నాగన్న, మండల నాయకులు ఎస్ మధుసూదన్ ,వి సుధాకర్ పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



జిల్లామోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంతాపసభ



సిఐటియు ఆధ్వర్యంలో



రజక వృత్తిదారు సంఘం ఆధ్వర్యంలో



వేర్ హౌస్ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో



బుధవార్ పేటలో

ఓటర్ల జాబితా సవరణకు రూ .22 లక్షలు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఓటర్ల జాబితా 2025 సవరణ కార్యక్రమానికి రూ.22 లక్షల నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులను మోటార్ల జాబితా తయారీ నిమిత్తం ఖర్చు చేయాలని జిల్లా ఎన్నికల అధికారికి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం అందజేత

వరద బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధికి సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున రూ.75000 చెక్కును జిల్లా కలెక్టరుకు అందజేశారు. సీనియర్ అడ్వైజర్ డాక్టర్.కె.రావు, అడ్వైజర్ కెసిఎస్ రాయుడు, ప్రెసిడెంట్ రంగయ్య, సెక్రెటరీ శేషిరెడ్డి, ట్రెజరర్ స్వామి లు ఉన్నారు.

సీతారాం ఏచూరిది ఖననంలేని జననం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఖననం లేని జీవితం సీతారాం ఏచూరిదని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం అన్నారు. భూమి మీద ఎందరో జన్మిస్తారని, కొందరు మాత్రమే ప్రజల కోసం జీవిస్తారన్నారు. వారి జీవితాలను త్యాగం చేస్తారన్నారు. అలాంటి వారిలో మరికొందరు తమ పార్థివ దేహాలను "ఖననం" లేకుండా వైద్య పరిశోధనల కోసం అప్పగించడం అంటే దేహాలను సైతం సమాజ హితానికి ఉపయోగించడమేనని అన్నారు. ఇది కొంతమంది మహానుభావులకే సాధ్యమన్నారు. అలాంటి వారిలో ఈరోజు నింగికెగిసిన అరుణతార, మూగబోయిన ప్రజా గొంతక సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఉండడం విశేషం అన్నారు. సిపిఎంలో దిగ్గజాలైన సిపిఎం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్, మాజీ ముఖ్యమంత్రులు జ్యోతిబసు, బుద్ధదేవ భట్టాచార్య, పశ్చిమబెంగాల్ సిపిఎం సీనియర్ నేత సమీర్ ముఖర్జీలు కూడా తమ పార్థివ దేహాలను వైద్య పరిశోధనలకు అప్పగించి మార్గదర్శకులు అయ్యారన్నారు. అలాంటి దిగ్గజాలు సరసన సీతారాం ఏచూరి చేరడం నేటితరం యువతకు, విలువలతో కూడిన రాజకీయాలకు ఆదర్శప్రాయుడని గర్వంగా చెప్పుకోవచ్చన్నారు. ప్రజల మనిషి ఏచూరి బహుభాషా కోవిదుడని కొనియాడారు.

పతకాలతో తిరిగి రండి

బిడిఎస్‌డిఒ భూపతిరావు

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్ : రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలో చక్కటి ప్రతిభ కనపరిచి పతకాలతో తిరిగి రావాలని జిల్లా క్రీడాధికారి భూపతిరావు అన్నారు. కర్నూలు రైల్వే స్టేషన్‌లో కర్నూలు జిల్లా టెన్నికాయిట్ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అడ్వకేట్ శ్రీధర్‌రెడ్డి తో కలిసి టెన్నికాయిట్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు శ్రీకాకుళంలో జరిగే 36వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలలో పాల్గొని జిల్లాకు పతకాలు సాధించాలని, తల్లిదండ్రులకు, శిక్షకునికి, పిఇటిలకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ టెన్నికాయిట్ పోటీలు శ్రీకాకుళం జిల్లాలోని పలాస మండలంలో జరుగుతాయని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు రవితేజ, కార్యదర్శి రమణ, మహేష్, శేషఫణి, పిఇటిలు సురేష్, మల్లయ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం

- సిహెచ్ఒ వెంకటేశ్వర్లు



సూచనలు ఇస్తున్న సిహెచ్ఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వాస్పత్రి సిహెచ్ఒ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా కుందనగుర్తి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో పిల్లల ఆరోగ్యంపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిహెచ్ఒ మాట్లాడారు. చిన్నపిల్లలకు చిన్నపాటి జలుబు, జ్వరం వచ్చినా అలసత్వం వహించకుండా సంబంధిత వైద్యులతో వైద్యం చేయించాలన్నారు. డెంగీ నివారణకు ముందు జాగ్రత్త వహించి దోమలు దరిదాపుల్లోకి రాకుండా పరిసరాలను, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలపై కూడా అంగన్వాడీ సిబ్బంది మరింత జాగ్రత్త వహించాలని కోరారు. ఎఎన్ఎం పద్మావతి, అంగన్వాడీ టీచర్ విశాలాక్షి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

- ఎంపిపి లక్ష్మీదేవమ్మ - సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి లక్ష్మి దేవమ్మ

ప్రజాశక్తి - నందవరం

గ్రామాభివృద్ధి, సంక్షేమం కోసం తమ కుటుంబం పనిచేస్తోందని ఎంపిపి లక్ష్మి దేవమ్మని తెలిపారు. శుక్రవారం మండలంలోని ముగతి గ్రామంలో బునకుంట దగ్గర ఆదెప్ప, మల్లికార్జున ఇంటి దగ్గర నుంచి బుడ్డ ఖాజా ఇంటి వరకు రూ.14 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి ఎంపిపి లక్ష్మీదేవమ్మ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ముగతి గ్రామంలో 20 ఏళ్లుగా రోడ్డు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. వారి ఇబ్బందులను సర్పంచి ముగతి విరుపాక్షిరెడ్డికి తెలపడంతో ఆయన తల్లి ఎంపిపి ముగతి లక్ష్మీదేవమ్మ సహకారంతో మండల అభివృద్ధి పనుల ద్వారా రూ.10 లక్షలు, సర్పంచి నిధుల నుంచి రూ.4 లక్షల కేటాయించారు. ఉపసర్పంచి గణపతి, వార్డు సభ్యులు సద్దుల హుస్సేన్ పీరా, నాగేష్, దాదా, చిన్న దౌలత్, వైసిపి నాయకులు, మోడల్ స్కూల్ మాజీ ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి, న్యూ బీసీ స్కూల్ మాజీ ఛైర్మన్ హుస్సేని, తారకరాముడు, మాకాసి రంగన్న, సుభాన్, బాబయ్య, దావీదు, ఉస్మాన్, రాముడు, సద్దల దస్తగిరి, బందేనవాజ్, ఈరన్న, భీమన్న పాల్గొన్నారు.

తెర్నేకల్ వైద్యాధికారిగా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర రెగ్యులర్ వైద్యాధికారిగా వెంకటేశ్వర్లు విధుల్లో చేరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ఇక్కడ డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న రామ శిరీష బదిలీపై వెళ్లిపోవడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రి నుంచి బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

దాతృత్వం చాటుకున్న రాజశేఖర్

ప్రజాశక్తి - మంత్రాలయం


వస్తువులను అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్స హించేందుకు పాఠశాలకు అవసరమైన వస్తువులు అందజేసి దాత రాజశేఖర్ మరోసారి తమ దాతృత్వం చాటుకున్నారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చెందిన ఆర్‌వి కన్‌స్ట్రక్షన్స్ అధినేత పి.రాజశేఖర్ తమ పాఠశాలకు రూ.25 వేల విలువ చేసే వస్తువులను అందజేసినట్లు తెలిపారు. తన మిత్రుడు, శ్రేయోభిలాషి తమ పాఠశాల తెలుగు బాష సబ్జెక్టు ఉపాధ్యాయులు బి.రామన్న అభ్యర్థన మేరకు ఇలాంటి సహాయం చేస్తున్నారన్నారు. గతంలో కూడా విద్యార్థులకు రూ.15 వేల విలువ చేసే క్రీడా దుస్తులు అందించారని తెలిపారు. సెప్టెంబర్ 15 ఆయన పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో డ్రిల్ మార్చ్ నిర్వహించడానికి ఒక మ్యూజికల్ డ్రమ్మును, విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారని చెప్పారు. ఆయన పంపిన దుస్తులను వ్యాయామ ఉపాధ్యాయులు బసవరాజు, నరసింహరాజు, విఠోబరావు, గోపాల్, చంద్రశేఖర్, రామన్న, భూషణం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

పింఛను డబ్బులు బొక్కేశారు...

- **పంచాయతీ కార్యదర్శుల చేతివాటం**
- **రూ.25 లక్షలు బ్యాంకులో జమ చేయని వైనం**
- **వారం రోజులు గడువు ఇచ్చిన జిల్లా అధికారులు**

ప్రజాశక్తి - హోళగుంద

కంచె చేను మేస్తే అన్న చందనంగా మారింది కొందరు పంచాయతీ కార్యదర్శుల పనితీరు. బాధ్యతయుతంగాగా పనులు చేయాల్సిన అధికారులు ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించారు. ప్రజలకు సక్రమంగా పింఛన్లు పంపిణీ చేసి మిగిలిన మొత్తాన్ని బ్యాంకుకు జమ చేయాల్సిన కార్యదర్శులు తమ జేబు నింపుకున్నారు. సుమారు రూ.25 లక్షల ప్రభుత్వ సొమ్మును నాలుగేళ్లుగా ఖజానాకు చెల్లించకపోవడంపై జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హోళగుంద మండలానికి చెందిన కొందరు పంచాయతీ కార్యదర్శులు 2020 సంవత్సరం నుంచి 2024 వరకు పింఛన్ల పంపిణీలో నెలనెల మిగిలిన పింఛన్ల మొత్తం ఖజానాకు జమ చేయలేదు. నాలుగేళ్లుగా రూ.25 లక్షలు పక్కదారి పట్టినట్లు జిల్లా అధికారులు గుర్తించినట్లు సమాచారం. సుమారు రూ.25 లక్షలను సంబంధిత కార్యదర్శులు కట్టాల్సి ఉన్నట్లు తెలిసింది. వారం రోజుల్లో డబ్బులు మొత్తం కట్టాలని, లేకపోతే నోటీసులు జారీ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని సంబంధిత ఎంపిడిఒకు మౌఖిక ఆదేశాలు అందినట్లు సమాచారం. ఈ విషయంపై ఎంపిడిఒ సుహాసినమ్మను వివరణ కోరగా... జిల్లా అధికారుల నుంచి ఫోన్ వచ్చిన మాట వాస్తవమని, పింఛను డబ్బులు ప్రభుత్వానికి కట్టని సంబంధిత కార్యదర్శులకు ఇప్పటికే సమాచారం అందించామని తెలిపారు. డబ్బులు కట్టకపోతే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





కురువ సంఘం నాయకుని

అనుమానాస్పద మృతి

- **హత్య.., ఆత్మహత్య..?**
- **పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెల్లడి కావాల్సిఉంది**

ప్రజాశక్తి - చిప్పగిరి


కారుమంచప్ప (ఫైల్)

కురువ సంఘం నాయకులు చిప్పగిరి గ్రామానికి చెందిన కారుమంచప్ప (62) అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. చిప్పగిరి గ్రామానికి చెందిన కురువ ఉలితప్ప కుమారుడు కారుమంచప్ప ఆలూరు, గుంతకల్లు రహదారి పక్కన ఉన్న పొలంలో వేప చెట్టుకు ఉరి వేసుకొని ఉన్న సంఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. కురువ సంఘం నాయకులు కారుమంచప్ప గురువారం గుంతకల్లుకు వెళ్లి తిరిగి సాయంత్రం 6.30 - 7 గంటల సమయంలో స్వంత గ్రామం చిప్పగిరికి వస్తుండగా ఈ ఘటన జరిగి ఉండవచ్చని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కారుమంచప్పది హత్యనా..? లేక ఆత్మహత్యనా..? మృతికి గల కారణాలు ఏమిటని ఆలూరు సిఐ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో చిప్పగిరి ఎస్ఐ రమేష్ బాబు కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతి సంఘటన తెలుసుకున్న పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసును అన్ని కోణాల్లోనూ పరిశీలించి వాస్తవాలను వెలికి తీయాలని సిఐ, ఎస్ఐలను డీఎస్పీ ఆదేశించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాస్ నాయక్, ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


రాఘవేంద్రుని దర్శించుకుంటున్న రాఘవ లారెన్స్

రాఘవేంద్రుని సన్నిధిలో రాఘవ లారెన్స్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని నృత్య దర్శకులు, దర్శకులు, నటుడు రాఘవ లారెన్స్ శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు.

పెద్దహరివాణంలో నీటి కుక్కలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో బ్రిడ్జి వద్ద నీటి కుక్కలు శుక్రవారం ఉదయం దర్శనమిచ్చాయి. బ్రిడ్జి కింద గడ్డి వంకలో తిరుగుతూ వీక్షకులను కనువిందు చేస్తున్నాయి. పెద్దహరివాణం గ్రామంలో మొదటిసారిగా గ్రామస్తులకు కనిపించాయి. వారం క్రితం వర్షానికి వచ్చి ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. గత కొంతకాలంగా పూర్తిగా కనుమరుగైన ఈ ఉభయ చర జీవులు పెద్ద సంఖ్యలో కనిపించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. వాగుల్లో, నదుల్లో చేపలు పట్టుకొని ఒడ్డుకొచ్చి తింటూ ఉంటాయి ఈ నీటి కుక్కలు. మత్స్యకారులకు వీటి గురించి బాగా తెలుస్తుంది. మనుషులకు ఎలాంటి హాని చేయకపోయినా మత్స్యకారులకు తీవ్ర నష్టం కలిగిస్తాయి. చేపల కోసం వేసిన వలలను కొరుకుతూ నాశనం చేస్తుంటాయి. వలలో పడ్డ చేపలను తింటుంటాయి. అలాంటి నీటి పిల్లులు గడ్డి వంక వద్ద కనువిందు చేస్తున్నాయి. వీటిని చూసేందుకు జనాలు క్యూ కట్టారు. ఎప్పుడూ చూడని ఈ వింత జీవులను ఒక్కసారి చూడడంతో ప్రజల్లో ఎంతో ఆసక్తి కనిపించింది. చూసేందుకు ముంగిస లాంటి తల, మెడ చూస్తే సీల్ చేప గుర్తొస్తుంది.

కెజిబివిలో జిసిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - నందవరం

నందవరం కస్తూరిబా గాంధీ పాఠశాలలో శుక్రవారం జిసిడిఒ మేరీ స్నేహలత తనిఖీ చేపట్టారు. పాఠశాలలోని నీటి సమస్య, మెనూపై కస్తూరిబా ప్రిన్సిపల్ శైలజను ఆరా తీశారు. భోజనం, నీటి సమస్యలు ఏవైనా ఉన్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం ఆమె విద్యార్థినులతో కలిసి భోజనం చేసి పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థినుల చదువు విధానంపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, అర్థమయ్యే విధంగా విద్యను అందించాలని సూచించారు. నీటి సమస్యపై డిఇఒ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.



ఏచూరి ఆశయాలను సాధిద్దాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలను నెరవేరుద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, వెంకటేశులు తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష భావాలు కలిగి దశలవారీగా సిపిఎం ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. ప్రపంచీకరణ, సెక్యులరిజంపై ఎన్నో రచనలు చేశారన్నారు. ఆయన మరణం తీరని లోటని తెలిపారు. అలాగే ఆదోనిలోని సిఐటియు కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి లింగన్న అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. అంతకుముందు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు మాట్లాడారు. సీతారాం ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని తెలిపారు. ఏచూరి రాజకీయ నాయకుడే కాక, రచయితగా, ఉత్తమ పార్లమెంటు సభ్యుడుగా మంచి గుర్తింపు పొందారని చెప్పారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదికను నిర్మించడంలో ప్రముఖ పాత్ర ఏచూరిదేనని తెలిపారు. మతతత్వ బిజెపిని నిలువరించడం కోసం ఇండియా వేదికను బలోపేతం చేయడంలో ఆయన ముందున్నారన్నారు. అలాంటి నాయకుని మృతిని వామపక్ష శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నాయని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు పి.ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు తిప్పన్న, ముక్కన్న, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వీరారెడ్డి, రామాంజనేయులు, ఉచ్చీరప్ప, తిక్కప్ప, రామాంజనేయులు, వెంకటేష్, అజీమ్ ఖాన్, నాగేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, నాగరాజు, డివైఎఫ్ఐ నాయకులు వీరేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ ఉన్నారు. **దేవనకొండ**లో ఆయనకు నివాళు లర్పించారు. సిపిఎం మండల నాయకులు అశోక్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు యూసుఫ్ బాష, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పాండు, వెంకటేష్, కాంతయ్య, రవి, రాముడు, రంగన్న పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో కెవిపిఎస్, సిఐటియు, యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్, యుటిఎఫ్ నాయకులు నరసింహ, గుమ్మల బాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు దండు ఖాజా, సిఐటియు నాయకులు ఈరన్న గౌడ్ పాల్గొన్నారు. **ఆస్పరి**లోని సుందరయ్య భవనంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, మండల నాయకులు రంగస్వామి, రామాంజనేయులు, ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, మహేంద్ర, వీరభద్ర, రవి, వీరేష్ పాల్గొన్నారు. **కౌతాళం**లోని సిపిఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ వీరన్న, నాయకులు ఉల్లిగయ్య, వలీ పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలం కల్లుకుంట, నౌలేకల్ గ్రామాల్లో నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, నాయకులు పరమేష్, అబ్దుల్, దేవదాసు, శ్రీనివాసులు, డివైఎఫ్ఐ నాయకులు రాజేంద్ర, ఉరుకుందు, గోవిందు, మల్లికార్జున పాల్గొన్నారు. **కోసిగి**లో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి రాముడు, సిపిఎం నాయకులు వీరేష్, వెంకటేష్, రామకోటి, హనుమంతు, నాగేంద్ర, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు జి.నాగేశ్వర, రైతు సంఘం నాయకులు పూజారి శ్రీనివాసులు, ఆటో యూనియన్ నాయకులు వీరేష్, ప్రభాకర్, చిన్నన్న పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో...

ఆదోని పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జి.మహానంది, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిరాం, టిడిపి సీనియర్ నాయకులు ముజీబ్, బసాపురం నీలకంఠ, ఎల్లప్ప, మల్లికార్జున, భరత్, వేదవతి నీటి సాధన సమితి నాయకులు బి.శ్రీనివాసులు, రంగస్వామి పాల్గొన్నారు.


ఆదోనిలో నివాళులర్పిస్తున్న నాయకులు


దేవనకొండలో


గోనెగండ్లలో...

ఘనంగా ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం

ప్రజాశక్తి - ఆదోని

ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా ఆదోనిలోని మున్సిపల్ స్కూలులో లయన్స్ క్లబ్, అవోపా, వామ్ సంయుక్తంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్‌లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు మాట్లాడారు. ప్రతేడాది సెప్టెంబరు రెండో శుక్రవారం ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కింద పడినప్పుడు దెబ్బలు తగలడం, ఎముకలు విరగడం, ప్రమాదవశాత్తు కాలడం, మూర్ఛ, ముక్కులో నుంచి రక్తం కారడం, వాయి, వడదెబ్బ తదితర ప్రమాదాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి, అవోపా ప్రధాన కార్యదర్శి వంకదారు శ్రీనాథ్ గుప్తా, కోశాధికారి శంకరమ్మ, విశిష్ట సభ్యులు వనపరాజు, మల్లికార్జున గౌడ్, అవోపా వెంకటేశ్వర్లు, రఘు పాల్గొన్నారు.

దళిత మహిళపై ఆటవిక చర్య సిగ్గుచేటు

- స్తంభానికి కట్టేసి కొట్టిన మానవ మృగాలను శిక్షించాలి - కెవిపిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళిత మహిళలను స్తంభానికి కట్టేసి కొట్టడం ఆటవిక చర్య అని, ఈ దుర్ఘటనకు పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో మాదిగ గోవిందమ్మను స్తంభానికి కట్టేసి కొట్టిన సంఘటనను నిరసిస్తూ పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవ సహాయం మాట్లాడారు. కల్లుకుంట గ్రామంలో ఎస్సీ కులానికి చెందిన గోవిందమ్మ కుమారుడు ఈరన్న ఆరు నెలల క్రితం బీసీ చాకలి సామాజిక వర్గానికి చెందిన నాగలక్ష్మిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారని తెలిపారు. కక్ష సాధింపుగా, కుల దురహంకారంతో చాకలి ఎర్రన్న, చాకలి ముకప్ప, బంధువులు మాదిగ గోవిందమ్మను ఇంటి నుంచి ఈడ్చుకుంటూ వచ్చి విద్యుత్ స్తంభానికి నిర్బంధించి కట్టేసి కొట్టారని చెప్పారు. యువతి అన్న వికలాంగుని చేత గోవిందమ్మకు తాళి కట్టించే ప్రయత్నం చేయడం ఆటవిక చర్య అని విమర్శించారు. సమయానికి పోలీసులు రాక పోయి ఉంటే గోవిందమ్మ చనిపోయేదని తెలిపారు. కలెక్టర్, ఎస్పీ కల్లుకుంట గ్రామాన్ని సందర్శించి నేరానికి పాల్పడిన మానవ మృగాలపై కేసు నమోదు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా శిక్షలు విధించి న్యాయం చేయాలని కోరారు. లేకపోతే 'చలో కల్లుకుంట' చేపడతామని హెచ్చరించారు. కెవిపిఎస్ నాయకులు సుమాల ఆంథోని, సోగనూరు మనోహర్, కలుగొట్ల రాజు, మెకానిక్ సుమాల రాజు, కదిరికోట భాస్కర్, ఎర్రకోట అరుణ్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్, నాయకులు అడ్వకేట్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. కెవిపిఎస్ నాయకులు దస్తగిరి, రంగన్న, రంగప్ప, వెంకటేష్, కన్నప్ప పాల్గొన్నారు.

మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో ఒక దళిత మహిళకు జరిగిన అవమానం హేయమైందని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరన్న, అంజి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కులాంతర వివాహం చేసుకున్న కుమారుని తల్లిని నిర్బంధించడమే కాక విద్యుత్ స్తంభానికి కట్టేసి వికలాంగులతో వివాహం చేయించాలని అనుకోవడం దుర్మార్గమని తెలిపారు. ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో మూడు నెలల క్రితం గుండమ్మ హత్య మరువకముందే ఈ ఘటన జరగడం దారుణమన్నారు. కుల వివక్షపై ప్రత్యేక చట్టాలు, ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధిపత్య కులాలకు కొమ్ము కాస్తున్నాయని విమర్శించారు. ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్టు చేసి శిక్షించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపడుతున్న నాయకులు

కుల వివక్ష చూపిన వినోద్‌పై చర్యలు తీసుకోవాలి

- బాధితుడు, ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - నందవరం

కుల వివక్ష చూపిన టీ స్టాల్ యజమాని వినోద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు బండారి తిప్పరాజు, ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బాధితులు, గ్రామంలోని ఎస్సీలతో కలిసి ఎంఆర్‌పిఎస్ నాయకులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపిడిఒ దశరథ రామయ్యకు, ఎస్ఐ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు శాంతి రాజు, బుజ్జిబాబు, చిన్న పోతప్ప మాట్లాడారు. గురువారం సాయంత్రం టీ స్టాల్ యజమాని వినోద్ బాధితుడు తిప్పరాజును కులం పేరుతో దూషించారని తెలిపారు. తిప్పరాజుకు ప్రత్యేక ప్లాస్టిక్ గ్లాసులో టీ పోశారని చెప్పారు. అదేమిటని అడిగితే తిప్పరాజును, ఆయన కుమారుని దూషించారని తెలిపారు. టీ స్టాల్‌లో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగిస్తున్నారని, ఎస్సీలకు ప్రత్యేకంగా ప్లాస్టిక్ గ్లాసులో టీ పోస్తున్నారని చెప్పారు. కులం పేరుతో దూషించిన వినోద్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ మండల ఉపాధ్యక్షులు యర్రన్న, మండల కన్వీనర్ సత్యానందం, పెద్దకడబూరు నాయకులు ఆదాం, రవి, బుజ్జప్ప, దుబ్బన్న, ఆనోక్, సురేష్, నందవరం నాయకులు రాజు, ప్రకాష్, ఆనంద్, దేవదాస్, శాంతిరాజు, ఏసన్న, ఇమ్మానుయేల్, బతుకన్న, లక్ష్మన్న, పెద్దయ్య, సామ్యేల్, మాచాపురం నాయకులు దేవ సహాయం, చిన్ రాజు, భూపతి పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు


ఆందోళన చేస్తున్న నర్సులు

జిఒ 115ను రద్దు చేయాలి

- ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ స్ట్రగుల్ కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జిఒ 115ను తక్షణమే రద్దు చేయాలని నర్సింగ్ స్ట్రగుల్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ స్ట్రగుల్ కమిటీ నాయకులు నరసింహ, వీరేష్, శశికళ, రాజమ్మ, శోభారాణి, సుబ్బమ్మ, రాజా నాయక్, నరసింహ మాట్లాడారు. సర్వీసులో ఉన్న ఎఎన్ఎంలకు ఇంటెన్సిఫైడ్ జిఎన్ఎం పేరుతో నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని చెప్పి 18 నెలలపాటు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ ఇచ్చిందని తెలిపారు. దీనివల్ల నర్సింగ్ వ్యవస్థకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ గతంలోనే అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి, వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పించామని చెప్పారు. హైకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేశామన్నారు.

ఉరుకుందలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ఆవరణంలో డిప్యూటీ కమిషనర్ హెచ్‌జె.వెంకటేష్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం దేవాలయం పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, రాళ్లను తొలగించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా స్వచ్ఛభారత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. సూపరింటెండెంట్ వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, కుమార్, వీరేష్ పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీదక్షిణామూర్తి రథోత్సవం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని కారుమంచి గ్రామంలో వెలిసిన శ్రీదక్షిణామూర్తి స్వామి వారి 32వ ఆరాధనోత్సవాలు కమనీయంగా సాగాయి. శుక్రవారం అర్చకులు రూప మోహన్ ఆధ్వర్యంలో స్వామివారి సమాధికి ప్రభాత సేవ, గాయత్రి మాత మహా యజ్ఞం నిర్వహించారు. స్వామివారి సమాధిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయం భక్తులతో కిటకిట లాడింది. సాయంత్రం శివారెడ్డి ఇంటి నుంచి కుంభోత్సవంతో ఆలయానికి చేరుకుని రథోత్సవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈశ్వర స్వామి దేవాలయం వరకు రథోత్సవం ముందుకు సాగింది. అనంతరం యథాస్థానానికి చేరుకుంది. నెంకంటి బొమ్మలు, కట్టికొలన్నలు, నందికోల్లు భక్తులను ఆకట్టుకున్నాయి. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా సిఐ మస్తాన్ వలీ బందోబస్తు నిర్వహించారు. సర్పంచి లక్ష్మీ, వైస్ ఎంపిపి చంద్ర కళ, గ్రామ పెద్దలు మురళీ రెడ్డి, రవి రెడ్డి, కౌలుట్ల, రాజన్న గౌడ్, దర్గయ్య, తిక్కయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

- వరద బాధితులకు రూ.11 లక్షల విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

విజయవాడ వరద బాధితులకు టిడిపి అండగా ఉంటుందని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, యువ నాయకులు సురేష్ నాయుడు, వెంకటపతి రాజు తెలిపారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రకృతి విపత్తు వల్ల విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. వారికి ధైర్యం చెబుతూ అటు అధికారులను, ఇటు పార్టీ శ్రేణులను సేవలో నిమగ్నం చేస్తున్న మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని చెప్పారు. టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి సహకారంతో, సీనియర్ నాయకులు ఉల్లిగయ్య ఆదేశాల మేరకు కౌతాళం మండల, గ్రామ ప్రజలు, నాయకులు స్వచ్ఛందంగా వరద బాధితులకు విరాళాలు అందజేశారని తెలిపారు. రూ.11,03,141 సేకరించి సిఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేసినట్లు చెప్పారు. టిప్పు సుల్తాన్, సౌద్రీ బసవరాజు, నీలకంఠ రెడ్డి, రాజానందు, రామలింగ, వీరేష్, మూకన్న, రామంజినేయులు, జనసేన రామాంజినేయులు, గుండప్ప, శివ చూడి, అమ్ము వలీ, నరసప్ప, లింగేష్, తాయన్న, నబీ, శ్రీరామ్, నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

నేరుగా పథకాలు అందజేయాలి

- జైభీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు జానయ్య మాదిగ

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజనులకు నేరుగా పథకాలు అందించాలని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదోనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత, గిరిజనుల్లో భార్యభర్తలు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులుంటే వారికి, సంపన్న వర్గాలుగా అభివృద్ధి చెందిన వారసత్వాలకు రిజర్వేషన్ తీసి వేసి, నిరుపేద దళిత గిరిజనులకు రిజర్వేషన్ వర్తించే దిశగా క్రిమిలేయర్ అమలు చేసేలా రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేస్తామన్నారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మాదాసుల రాజాబాబు, మండల అధ్యక్షులు గుమ్మల రాజేంద్ర, మండల నాయకులు గుమ్మల సుధాకర్, గుమ్మల ఉదయ్ కుమార్, గంధాలం సుందర్ రాజ్, ఎం.రాజశేఖర్, ఎం.నరసప్ప, బైచిగేరి మాజీ ఎంపిటిసి ఎం.ప్రభాకర్, రామాంజిని, ఎం.చంద్రశేఖర్, ఎం.మార్కు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి - ఆలూరు

అంబేద్కర్ గురుకుల పాఠశాల నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు పొందిన తెలుగు పండిట్ నరసింహులును ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో సన్మానించారు. శుక్రవారం మండలంలోని అరికెర అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అవార్డు గ్రహీత నరసింహులును కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, బాలచంద్ర, మనోరాజు, లక్ష్మన్న, ప్రదీప్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ 2వ జూనియర్ కోర్టులో : కర్నూలు
ఓ.ఎస్.నెం.1193/2021

ఆర్.వంశీకృష్ణ. ...వాది

(ఎదిరి)

బి.సూర్యసింగ్ & 12 ఇతరులు. ...ప్రతివాదులు
12. రుక్మిణి భర్త లేట్ సూర్యసింగ్,
ఇంటి నెం.65/29, పెద్దమార్కెట్ స్ట్రీట్,
కురువ వీధి, కర్నూలు.

ప్రతివాది 12కి దావా సమన్లు

పై నెంబర్ దావాలో వాది ప్రతివాదులపై సూట్ ఫర్ డిక్లరేషన్ & క్యాన్సిలేషన్ ఆఫ్ సబ్సిక్విటెంట్ డాక్యుమెంట్స్ కేసు దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది 12 అయిన నీకు ఆక్షేపణ వున్న 27-9-2024 తేది పగలు 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించ బడును.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

జి.పి. శ్యామ్ సుందర్,
వాదిపరం అడ్వకేట్, కర్నూలు.
సెల్ : 9440483019